# లాసుగు

"కె.సి.బి. వలలో ఇద్దరు గుమస్తాలు"

గుండె బితుక్కుమంది గుర్నాధానికి ఆ వార్త చదవగానే. ఏదైనా చెత్త పాటైనా, పొద్దున్నే వింటే రోజంతా ఎంత వద్దనుకున్నా నోట్లో అదే నానుతుంది. ఉదయాన్నే ఇటువంటి వార్త మనసులో దూరితే రోజంతా అంతే.

నిన్న సాయంకాలం ఆఫీసయ్యాక మేనేజరు పిల్చిచెప్పింది గుర్తొచ్చింది. ఫలాని బిల్లు పాసైంది. పదివేలు! ఫైవ్ పర్సెంట్ కలెక్ట్ చెయ్యాలి పార్టీ నుండి. ఐదొందల్లో మూడు మేనేజరుకి, అకౌంట్స్ గుమస్తా పద్మనాభానికి వందా, తనకి వందా.

ఆఫీసులో అడుగు పెడ్తూంటే బిల్లు పుచ్చుకోవాల్సిన పార్టీ నమస్కారబాణం వదిలేడు. నమస్కారం తీసుకున్నట్టూ, ఐదొందలవుతుందన్నట్టూ, పనైనట్టూ, రకరకాల అర్థాలు స్ఫురించేటట్టు అభయహస్తం చూపించేడు గుర్నాధం.

సీటులో కూర్చుని... "పద్మనాభం! పార్టీ వచ్చేసినట్టున్నారు..." అంటూ ఇంకా ఏదో మాట్లాడబోయేడు.

"ష్..." అని ముక్కుమీద వేలేసి చిన్నపిల్లాణ్ణి గదమాయించినట్టు గదమాయించేడు పద్మనాభం. అర్థం చేసుకొని అతని కళ్ళ చివరి నుండి చూపులతాడు పట్టుకొని ఆ చివరికి చేరేడు. అక్కడ ఓ పెద్దమనిషి చిరుగు పంచె, మాసిన లాల్చీ, చెదిరిన జుత్తూను. ఏభై ఏళ్ళుంటాయి. చేతులు వెనక్కి విరుచుకొని గేటు దగ్గర నిలబడి తీక్షణంగా తిన్నగా ఆఫీసు గదిలోకి చూస్తున్నాడు.

ఎవరన్నట్టు కళ్ళతోనే ప్రశ్న గుర్తు రాసేడు గుర్నాధం. "ఆ ధీమా, ఆ దర్జా, ఆ వాటం చూస్తుంటే ఎ.సి.బి..." అని మాటలు మింగేసేడు పద్మనాభం.

పక్కున నవ్వొచ్చింది "ఏది? ఆ చిరిగిన పంచె, మాసిన లాల్చీ... ఏ.సి.బీ?"

"ష్... నెమ్మది... సూటూ బూటూ వేసుకొనివస్తే... గుడినీ,గుళ్ళో లింగాన్నీ మింగేసే నువ్వు వాణ్ణికూడా మింగేయవూ.... అందుకే..."

అంతవరకూ అల్లంత దూరాన బెంచిమీద వేళ్ళాడిన పార్టీ, పక్షిలా వచ్చి టేబులుముందు వాలేడు. ఆసమయంలో గేటు దగ్గరి పెద్ద మనిషి కూడా తిన్నగా వచ్చి ఆఫీసు గదిలో నిలబడ్డాడు. నోరు విప్పబోతూ ఇటు పార్టీవైపూ పెద్దమనిషి వైపూ, మార్చి మార్చి చూసేడు గుర్నాధం.

ఆ పెద్దమనిషి ముఖం సీరియస్‌గా వుంది. కళ్ళు చింతనిప్పులు, చూపులు ఆగ్నేయాస్త్రాలు.

"ఇలా వచ్చి కూర్చోడి. ఎవరు కావాలి" అని పద్మనాభమే కదిపేడు. అసాధ్యుడు.

"ఇంతకూ మీరెవరు?" కాస్త ఘాటీగానే అడిగాడు.

"మీకెందుకు?"

గతుక్కుమన్నారిద్దరూను. దాంతో ఇద్దరికీ నమ్మకమూ కుదిరిపోయింది.

ముఖం నిండా నవ్వు పులిమేసుకొని అక్కడికా పెద్ద మనిషేదో తనని పొగిడేసినట్లు... "రండి కాఫీ తీసుకుందాం" అంటూ పద్మనాభం అతని చెయ్యి పట్టుకుని తీసుకు వెళ్ళేడు. కాదు, లాక్కెళ్ళేడు.

ఆ కాస్త రిలీఫ్‌లోనూ గబగబా బిల్ పేమెంట్ చేసేసాడు గుర్నాధం. "అయిదు శాతం తెలుసుగా... ఇప్పుడొద్దు రేపు కనిపించు... వెళ్ళెళ్ళు..." అంటూ తగిలేసేడు. పార్టీ అటు వెళ్ళేడు పద్మనాభం ఇటు వచ్చేడు.

"హమ్మయ్య... పది రూపాయలైంది. పీడా వదిలింది" అని నిట్టూరుస్తూ కూర్చుని "సుబ్బరంగా మెక్కేడు. విషయం మాత్రం కక్కలేదు." అన్నాడు పద్మనాభం. "రేపు రమ్మన్నావు కదా..." అనుకుంటూ ఈసురోమని ఫైల్లో తలదూర్చేడు.

ఆఫీసయ్యాక జ్ఞాపకమొచ్చింది గుర్నాధానికి. బజార్లో కిరాణా కొట్టుకెళ్ళేడు. "ఓయ్ షావుకారూ... ఓ వంద రూపాయల సరుక్కావాలి. మాఆవిడ ఇండెంట్ పెట్టేసింది. డబ్బులు రేపిస్తాలే" అంటూ లిస్టు ఇచ్చేసి బయటికొచ్చి నిలబడ్డాడు. ఇద్దరు మాట్లాడుకుంటున్నారు.

"ఏ.సి.బీ. అనగానే... ఆ పార్టీగాడెవడో అదిరిపోయాడు. లంచం ఇవ్వడం కూడా నేరమే... జాగ్రత్త అనగానే ఐదొందలు నాచేతిలో పెట్టేసి అదే పరుగు..." నవ్వుతున్నాడు. అవును ఆ పెద్దమనిషే!

"బావుంది గాని కథడ్డం తిరిగి వాళ్ళే పోలీసుల్ని పిలిపించివుంటే?" అలాంటివాడే మరొకడు! అడుగుతున్నాడు.

"అన్నిటికీ సిద్ధమయ్యే కదా వెళ్లేను. ఇటు గుమాస్తాల్లోనూ అటు పార్టీలోనూ లొసుగులుండబట్టే వాళ్ళేం చెయ్యలేరనేకదా సాహసం చేశాను. వాళ్ళ బలహీనతే... నాకు కడుపునిండా తిండి... ఐదొందలు దక్షిణా" ఇద్దరూ నవ్వుకుంటున్నారు.

నీరైపోయాడు గుర్నాధం

*(ఆంధ్రభూమి డైలీ, 15-11-1986)*